# ఆత్మబల

"ప్రియమైన శ్రీవారికి

మీ రాణి వ్రాయునది.

మీరు నాకోసం హృదయంఅంతా వెన్నెల నింపుకుని వేయికన్నుల శరీరంతో నిరీక్షిస్తున్నారని తెలుసును. కాని ఏంచేయను? నా శరీరం చాలా అనారోగ్యంగా వున్నది. అంచేత నేను ప్రస్తుతం మీ 'రూపు' నా కళ్ళలోనే నిలుపుకుంటూ మనిద్దరం ఏనాటికీ విడిపోని ఏక శరీరులమయ్యేకాలం రావాలని భగవంతుని ప్రార్థిస్తూ రోజొక యుగంలాగ గడుపుతున్నాను. చిక్కని ఆపున్నమి వెన్నెల్లో, లేతపసరిక బయళ్ళను ఒరుసుకుంటూ ప్రవహించే ఆ నదీతీరంలో, ఒండొరులం మనం ఎలా ఆనందాన్ని...'

"ఛీ ఛీ!"

కళ్ళమ్మట నీళ్లు తిరిగాయి కమలకి. 'చదువొద్దు. సభ్యతకాదు' అనుకుంది కమల. కాని ఆమె కళ్ళు ఆగలేదు. పూర్తిగా ఆ పచ్చిశృంగార లేఖని చదివేశాయి. ఆవిషయాలు ఆమె తలకి ఎక్కిపోగా, మెదడంతా వేయి సుత్తులతో మోదుతున్నంత బాధ కలిగింది. ఒక్కసారి రెండుచేతులతోనూ బాధగా కణతలు రుద్దుకుంది. సాయంకాలం ఐదుగంటల సమయం. భర్త ఆఫీసునుంచి ఇంటికి వచ్చేవేళయింది. పెరట్లో పనిచేసే మనిషి అంట్లు తోముతోంది. కమల ఆ ఉత్తరాన్ని యథాప్రకారం డ్రాయర్లో పడేసింది. నిర్వేదంగావచ్చి వంటింటి వసారాలో నించుంది. ఒకప్రక్క బొగ్గులబస్తా, చీపురుకట్టలూ,

వేరొకవంక కొత్తగాకొన్న రెండు కుంపట్లు; అల్మారాల్లో తాను ఎంతో అపేక్షగా సర్దుకొన్న పప్పుల డబ్బాలూ, ఆవకాయ జాడీలు; అన్నీ తన్ని 'ఓడిపోయావులే!' అన్నట్లు వెక్కిరిస్తున్నట్లు తోచింది ఒకసారి మెడ వెంపు చూసుకుంది. ఇంకా కలిపిగుచ్చని మాంగళ్యాలుగల పసుపుదారలు ఒకదానికొకటి పెనవేసుకుపోయి, మీ జీవితాలుకూడా ఇల్లానే ఒకళ్ళ జీవితంతో ఇంకొకళ్ళ జీవితం చిక్కుపడిపోయిందిసుమా! అన్న నిరూపణనిస్తున్నాయి. కమలకి పెళ్ళయి పదిరోజులయింది. ఆనందమూర్తికి సెలవులు లేకపోవటంనించి, ఇక ఎప్పటికయినా కాపురం పెట్టవలసి వస్తుందికదా అని, అతను వుద్యోగంచేసే వూరికి కమలని తీసుకువచ్చేశాడు. కమలకి మొదటిరోజు కొత్తగా, బెంగగావున్నా రెండురోజులు గడిచేసరికి ఆనందమూర్తితో బాగా చనువయిపోయింది. అతని ఆతని సూటైన ముక్కు, ఎదుటిహృదయాన్ని తన హృదయంలోకి అతివేగంతో లాక్కొగలిగే శాంతివంతమైన కళ్ళూ, (హార్టు విన్నింగ్ స్మైలూ,చూసి ముగ్ధురాలై పోయింది కమల బొత్తిగా చిన్నపిల్ల కాదు. ఇంటరువరకూ చదువుకుంది. సంగీత సాహిత్యాలంటే ప్రాణాన్నిచ్చేటంత అభిమానమున్నది. ముందుగా పెళ్ళి కుదిరిందని తండ్రి అన్నప్పుడు ఆమెకంతా కొత్తగా, బెంగగా రాబోయే భవిష్యత్తు గురించి దిగులుగా ఆలోచించింది కాని పెళ్ళయిన తర్వాత ఆనందమూర్తి చురుకుదనంలోనూ, అపేక్షతో మాట్లాడే మాటతీరువలోనూ, ఆమె సర్వవ్యథలూ మర్చిపోయింది. "ఆనందమూర్తి" తన తండ్రి వెలపోసికొన్న బొమ్మకాదు. సాక్షాత్తూ తన్ని మరోలోకానికి

గొనిపోయేటందుకు దిగివచ్చిన దేవమూర్తి అనుకుంది! అతని
మాటలు వింటూంటే ఆమె కళ్ళు ఏవేవో వూహించలేని
స్వప్నాలని చూసేవి. అల్లా అల్లా అతని కవిత్వపరంగా
మాట్లాడే తీరువని వింటూ, అతనికి తన సర్వస్వమూ అర్పించి
వేసింది! తాను ఆనందమూర్తి గృహిణి, ఇల్లాలు. ఆ రెండు
గదుల చిన్నఇల్లూ ఆమెకి "హనామల్"లా కనపడింది.
ఇంట్లోని ప్రతివస్తువూ ఎంతోమమకారంతో సర్దుకుంది తన
శరీరంలోని, ప్రత్యణువులోనూ, "ఆనందమూర్తి" మూర్తినే
నింపుకుంది. కాని, ఆ వుత్తరం, ఆ అసభ్యమైన శృంగార
వర్ణన కల ఉత్తరం చదివేక కమలకి తన కర్తవ్యమేమిటో
తెలిసిరావటంలేదు. 'ప్రేమ! పవిత్ర ప్రేమ!' అంటూ ఆనంద
మూర్తి ఈ పదిరోజుల్లోనూ చాలాసార్లు మాట్లాడేడు. తన్ని
పెళ్ళిచూపులకి వచ్చి చూచినప్పుడే తన మనస్సు పారవేసు
కున్నానన్నాడు! ఒకవేళ తన్ని పెళ్ళిచేసుకోవటం కుదరక
పోతే ఆజన్మాంతం బ్రహ్మచారిగా వుండి పోతానన్నాడు.
ఇదంతా తనలోని అందం, ఆతన్ని అమితంగా ఆకర్షించటం
వల్లనే అనుకుంది కమల. అనుకుని తన జీవితం ధన్యమైనట్లు,
కోటిజన్మల తపస్సు ఫలితంగా ఆనందమూర్తిని పెళ్ళాడ
కలిగినట్లు భావించింది కాని నిజం ఈరోజు తెలిసింది అతను
తనదగ్గర మాట్లాడేభాష ఆతని నాలిక్కి-- ఎన్నిరోజులుగానో
అలవాటు అయినది. అందుకనే అంత తేలిగ్గా ప్రేమపాఠాలు
చదవకలిగాడు. అటువంటివాళ్ళ నాలికలమీద ప్రేమ కవిత్వం
ఆశువుగా వస్తుంది. కమలకి గుండెల్లో దడగావుంది. చెప్ప
లేనిభయం, ఆవేదనా ఆమె మనస్సునిపట్టి కుదుపుతన్నాయి.

ఇప్పుడేం చెయ్యాలి తను? కొత్తగా పెళ్ళయిన పెళ్ళికూతురు. అప్పుడే భర్తని, అతని ప్రవర్తనని గురించి ప్రశ్నించవచ్చా? అలా ప్రశ్నిస్తే వచ్చే జవాబులు ఏ తీరువలో వుంటాయో ఎవరికి తెలుసు? ఆ సందేహాలు తీరకుండానే తన ముఖానికి చిరునవ్వు పూసుకుని అతనిలో సంతోషంగా ఐక్యంకాగలదా? అది తనవల్లజరగనిపని ఇటు మామూలు భార్యల్లా గట్టిగా నాలుగూ ఆడగాల్సిన పరిస్థితికాదు. అటు "నవోఢ" లా కులుకుతూ చిరునవ్వుల సింగారాలు ఒలకపోస్తూ తిరగగల్గిన పరిస్థితీకాదు. భగవంతుడా! ఎందుకు నన్నిలా చిత్రహింస పెట్తున్నావ్? ఏ జన్మలో చేసుకున్న పాపం ఇది? ఈజన్మలో నేను తెలుసుండీ చీమనయినా చంపలేదే? ఆమె ఎవరు? ఎందుకలా ఉత్తరం వ్రాసింది? ఇద్దరూ ప్రేమించుకున్నారా? ప్రేమించుకుంటే హాయిగా పెళ్ళిచేసుకోకూడదూ? ఏకకులం కాదా? ఈ రోజుల్లో కులాలపట్టింపులు ఎవరికున్నాయ్? ధనం లేమివల్లనా? ఆయనకే బోలెడు ఆస్తిపాస్తులున్నాయ్! భార్య తెచ్చే ధనంవల్ల ఆయన దరిద్రం తీరనక్కరలేదు. ఇటు ఆనందమూర్తిపరంగా చూస్తే ఆనందమూర్తికి సర్వస్వాతంత్రం వున్నది. అతను ధైర్యంగా తను నచ్చిన అమ్మాయిని పెళ్ళాడుతే వద్దని అడ్డుకునేవారెవరూ లేరు ఇంకా ఆ రాణి అనే గులాబీకి ఏమి ముళ్ళతీగలున్నాయో? అయితే అంత ముళ్ళ కంచెలమధ్య నున్నది, ఈయనని ఎలా ప్రేమించకలిగింది. ఇతను ఇంత ధైర్యంగాఆహ్వానించకలిగినప్పుడు ఆమె ముసుగు తెరలలో మ్రగ్గిపోవటం ఎందుకు? కమల మనస్సు వేదవాగ్నితో దహించుకపోతోంది. తను తలదాల్చినది సువాసనలు

వెదజల్లే సుకుమార సుందర పుష్పం అనుకుని మురిసిపోయింది. ఆ అందాల ఆరవిచ్చిన పూరేకుల నడుమ కణకణమండే నిప్పురవ్వ లున్నాయనీ, అవి ఎప్పుడో తన శిరస్సున పడి, తన శరీరాన్ని భస్మీభూతం చేస్తాయని ఇప్పుడు తెలిసివచ్చింది ఆమె శరీరం నిలువునా గజగజ వణికిపోయింది. "ఇ ంకీ ఆ రాణి ఒక్కసారి కనపడితే బాగుండు" అనుకుంది కనపడితే మట్టుకు ప్రయోజన మేముంది? "నీకు డబ్బుఉంది కనుక నా ప్రేమార్జిత హృదయాన్ని స్వార్జితం చేసుకోగలిగావు!" అని ఆమె తనపట్ల జెలసీ నింపుకోదా? ఆమె ఈయన్ని చేజేతులా తన సర్వస్వం అర్పించీకూడా దేనికని వొదులుకోవాల్సివచ్చిందో తనకు తెలుసుకోవాలంటే దారి ఏది? ఎవర్నడగాలి? ఎవరు చెప్పుతారు? అత్తవారు - ఎవరైనా ఆచూకీ ఇస్తారేమో అనుకుంటే తమతో అంత అభిమాన పూరితంగా మాట్లాడకలిగేవారే లేరు. అత్తగారు, మామగారూ లేరు. బావగార్లు వున్నారు. అన్నదమ్ముల్లో ఒకరి మీద ఒకరికి బాధ్యతలూ బరువులూ లేవు. పైగా 'మాలో' మేము ఒకరి స్వేచ్ఛానందాలకి ఇంకొకరం అడ్డురాము' అని గొప్ప చెప్పుకుంటారు. మస్తుగా డబ్బు వుండటంవల్ల మగ వాళ్ళందరికీ విపరీతమైన ఇగోయిజం అలవాటు అయింది ఆ ఇంటి ఆడవాళ్ళు తరతరాల పతివ్రతల వారసులుగా చలామణీ అవుతున్నారు. వాళ్ళకి ఆ ఇంట్లో నోరువిప్పి మాట్లాడే అర్హతలేదు. మగవాళ్ళకి నైతికవిలువల్లేవు. ధనమదాంధతతో వళ్ళు తెలియకుండా ప్రవర్తిస్తారు. ఆపైన రోగాలు పుట్టినాక ఇంట్లో ఆడవాళ్ళు తమలోని వేదవాగ్నిని తమలోనేఇముడ్చు

కొని సేవలు చేసి, తమ పసుపూ, కుంకుమా కాపాడుకుంటారు ఎవరిభర్తల నైతిక ప్రవర్తనని గురించి వాళ్ళే జాగ్రత్త వహించగల సామర్థ్యంలేని పూర్ క్రీచర్సు అయిన ఆ ఇంటి కోడళ్ళు ఇంక మరుదులని ఏమని కంట్రోలు చెయ్యగలరు? ఇవన్నీ తన తండ్రికి తెలియవా? తెలుసును. కాని ఏంచెయ్య గలరు? ఉండటానికి మస్తుగాడబ్బువుంది. పెళ్ళికొడుకు చూట్టా నికి అందంగావుంటాడు. అని ఇచ్చేశారు అవును, వాళ్లుమట్టుకు ఎక్కడని వెతుకుతారు? ఇంకా నలుగురు చెల్లెళ్ళు వున్నారు. అందరికీ ఈమాత్రపు సంబంధాలు వెతికి తెచ్చేసరికి తన తండ్రి తల పండిపోతుంది ఆనందమూర్తికైనా బయటకు ఏలోటూ కనపడదు. తనకైనా ఆతని చెడు అలవాట్లగురించి చింతలేదు. కాని, ఒకభయం!

ఇతనికి అలవాటయిన స్త్రీలు ఎటువంటివారు? వాళ్లు బొత్తిగా 'ప్రోస్టిట్యూట్స్' అయితే తను ఇతనితో సంసారం చేస్తే తనకి కుళ్ళి కుళ్ళి చావాల్సిన పరిస్థితి వస్తుంది! ఆభయం కరమైన రోగాలు తలుచుకుంటే వళ్ళు జలదరించిపోతుంది. తను పుట్టి పెరిగిన వాతావరణం ఎంత ఆహ్లాదకరమైనది? హాయైన పల్లెలో నవనవలాడే లేత కాయగూరలతో కమ్మని మాగడ పెరుగు, చిక్కనిపాలుతో పచ్చగా, ఏపుగా, ఆరోగ్యవంతంగా తన ఇరవయిరెండేళ్ళ శరీరంపెరిగింది. ముట్టుకుంటే కందిపోయే ముఖమల్ లాంటి మృదుత్వంతో ఉన్న తన చెంపల్ని ఎన్నో ఎన్నెన్నో 'లిప్‌స్టిక్' వేసిన పెదాలని స్పృశించిన పెదవులతో అతను తాకాడు 'ఛీఛీ' ఏం చేయాలి? ఆబుగ్గలమీద నిప్పులు

పోసుకుంటే బాగుండును కొన్నాళ్ళకి ఏమయినా మచ్చలు లేవచ్చును. ఒకవేళ ఏదయినా రోగం పట్టుకుని తను అనాకారి పరిస్థితిలోకివస్తే, ఇతను ఏమిచేస్తాడు? పుట్టింటికి పంపేస్తాడా? లేకమరీ దయగావుంటే హాస్పటల్‌లోపడేసి మందులు ఇప్పిస్తాడు. అక్కడితో తన చాప్టర్, తను ఈ లోకంలోకి వచ్చినపని సమాప్తమౌతుంది. భగవంతుడా! ఏమిటీ శిక్ష! కమల ఆవేదనాందోళనలతో దహించుకుపోతూండగానే సంజ చీకట్లు అలముకున్నయ్. 'ఆనందమూర్తి' వస్తున్నట్లుగా ఆతని ఈలపాట విన్పించింది. కమల శరీరం అంతా ముడుచుకపోయింది. గుండెలు దడదడ లాడాయి. ఈ వారంరోజులుగా ఆతని రాకకోసరం ఎంతో మనోల్లాసంతో ఎదురుచూసేది. ఆఫీసునుండి అతను రాగానే చిరునవ్వుతో ఎదురు వెళ్ళేది. కాని ఇవ్వాళ అతనికి ఎదురుగా వెళ్ళబుద్ధికావటంలేదు. ఒకవేళ ఏమన్నా అంటాడేమో అన్న భయం మనస్సుని మథన పర్చినా ఆమె కాళ్ళు కదలటంలేదు. నిర్జీవంగా ఆమె శరీరం వంటింటి తలుపు కానుకుని నిలబడింది. 'ఆనందమూర్తి' హుషారుగా బూట్లు టక టక లాడించుకుంటూ లోపలికి వచ్చాడు.

'కాఫీ - అలవాటయిన ధోరణిలో అన్నాడు. కమల తృళ్ళిపడింది. రోజూ పనిచేసేమనిషి రాగానే కుంపటి రాజేసి డికాషన్ తీసి ఫ్లాస్కులో పోసి, వంట కుపక్రమించేది. ఇవ్వాళ కుంపటే రాజెయ్యలేదు. తొందరగా బొగ్గులమీద ఇంత కిరసనాయిలు పోసి కుంపటి అంటించింది. భగ్గుమని

ఒక్కసారి కిరసనాయిలు అంటుకుంది. కాఫీ డికాషన్‌కి నీళ్ళు పడేసింది. ఆనందమూర్తి బట్టలు మార్చుకొని వంటింట్లోకి వచ్చాడు. 'కాఫీ ఇంకా చెయ్యలేదా!' అన్నాడు. కమలకి గొంతులో ఏదో అడ్డుపడ్డట్టువుంది జవాబు చెప్పలేకపోతోంది. తలమట్టుకు అడ్డంగా త్రిప్పగలిగింది.

'బాగా చీకటి పడిపోయిందే! ఈలోగా స్నానంచేసి వస్తాను.' టవల్ తీసుకుని బాత్‌రూంలోనికి వెళ్ళాడు కమలకి మళ్ళీ ఆలోచనలు ముసురుకున్నాయి. అతను ఎలాంటివాడు కానీ! తను అతనికి కావల్సినవేవో చేయటం తన కనీసధర్మం! అతని ప్రేమాయణాల జోలి తనకెందుకు! తనను అతను తిండీ బట్టా ఇచ్చి ఆజన్మాంతం పోషించవలసినవాడు! తను ఇతన్ని తిరస్కరించి ఎక్కడకు వెల్తుంది! చదువుకున్నది కనుక తనకి వుద్యోగం దొరకవచ్చును. తనకి ఐహికవాంఛలు ఉధృతనిగా లేవుకనుక నైతికోన్నతంగానే జీవితాన్ని నెగ్గించుకురావచ్చును. కాని అతన్ని ఎవరూ ఏమీ అనరుకదా! తనని అంటారు. కాని! భర్త నొదిలేసింది అంటారు. అతని మహానుభావత్వం ఇంకోమెట్టు ఎక్కువకి పెరుగుతుంది. తనని పుట్టింటిట్లోనూ, మెట్టినింట్లోనూకూడా నీచకంగా చూస్తారు. నవ్వేవాళ్లకి నవ్వ సంమూ, చెప్పేవాళ్ళకి చెప్ప సంమూ అవుతుంది. తన జీవితం. అంచేత పైకి ఏమీ తేలకుండా ఇక్కడే వుండటం మంచిది. అతని కేలాగూ హోటల్లో భోజనంచేయటంనించి కొంత ఖర్చు అవుతుందికదా! ఆఖర్చులోనే తనూ వండి పెడుతుంది. తను అతనికొక పనిమనిషిగా, వంటకత్తెగా వుంటుంది. తన జీవితం

వెళ్ళిపోతే చాలున్న. 'తన వైవాహిక జీవితం ఆనందంగా పది రోజులు గడిచింది. పదిరోజులు! ఒక్క పదిరోజుల నిర్మలానందమూ! తన వైవాహిక జీవితానికి అంతేమరి అదేచాలున్న' కాఫీ కలిపి బియ్యం పడేసింది కమల. ఆనందమూర్తి స్నానం చేసి లోపలకి వచ్చాడు మౌనంగా కాఫీ అందించింది కమల.

'అలా వున్నావేం?' అడిగాడు ఆనందమూర్తి.

'ఏంలేదు' ముక్తసరిగా, అతికష్టంమీద అంది కమల.

అమ్మమీద బెంగేస్తోందా కూచమ్మా?' పరిహాసంగా అన్నాడు ఆనందమూర్తి కమలకి అతని మొహంకేసి కళ్ళెత్తి చూట్టానికి ధైర్యం చాలటంలేదు. ఆనందమూర్తే వుల్లాసంగా మాట్లాడాడు.

'రేపాదివారం పదహారురోజుల పండుగట! మనిద్దర్ని రమ్మనమని వ్రాసారు మీ నాన్నగారు. నీకు వెళ్ళాలనుందా?' అన్నాడు.

'మీ ఇష్టం!' అంది కమల.

'నాఇష్టమా! బలేదానివే! మీ పుట్టింటికి వెళ్ళటానికి నా ఇష్టమేమిటి? నీకా లిబర్టీ ఎప్పుడో ఇచ్చాను. నీ ఇష్టం వచ్చినచోటుకు వెళ్ళొచ్చును. అయినా పదహారురోజుల పండక్కి ఏమిటీవిశేషం? మంగళసూత్రాలు రెండూ ఒకే బొందులో కలిపి ఏకంగా గుచ్చేయటమేకదూ! ఆమాత్రం నేను గుచ్చలేనా ఏమిటి? నేనే గుచ్చేస్తాను. మనం వెళ్ళక్కర్లేదు. ఏం చిట్టీ! రావాలంటే నాకు శెలవులేదు. పోనీ నిన్ను

పంపిద్దామనా్న నేను నిన్నువిడిచివొంటరిగా వుండలేను మా!' గోముగాఅన్నాడు ఆనందమూర్తి. కమలశరీరం జలదరించింది. ఒంటరిగా లేరట! మరి పెళ్ళికానన్నాళ్లూఏంచేసారు? ఒంటరిగా వుండలేనివాళ్ళు ఏంచేస్తారో అదేచేసారా చేయక? ధనిష్ఠాగారి కెరటాల్లో కాబోలున్న! ఖాకా పా తలఅంటుంది 'నువ్వు నాజీవితం లోకి ప్రవేశించకముందు రాబోయే నీకోసం, నా వాంఛలని అరికట్టుకోవాలా?' అని. అంత వాంఛలని అరికట్టుకోలేనివాళ్ళు పెళ్ళిళ్ళు చేసుకోకూడదూ? స్త్రీకి మాతృత్వం అనేది ప్రకృతి సిద్ధంగా సంక్రమించకపోతే స్త్రీ కూడా ఇల్లాపశృంఖలంగా వివారేమో! సాంఘిక కట్టుబాట్లకు లొంగి వుండాలనుకొన్న స్త్రీ కూడా మగవాడికి మంగళసూత్రం ముడివెయ్యకుండా శరీరాన్ని అర్పించదు.

'ఏమిటే మౌనవ్రతం! మాట్లాడవేం? నీకు ఒక్కర్తివైనాసరే వెళ్ళిపోవాలనుందా?' అన్నాడు ఆనందమూర్తి. నిజంగా వెళ్ళిపోవాలనేవుంది కమలకి కాని ఎక్కడకు వెళ్ళుతుంది? మునుపట్లా తల్లీతండ్రీ ఆదరిస్తారా? అని గతచరిత్ర అంతా తెలియచెప్పి తను అతనితో సంసారం చేయలేనని చెప్తే ఏమంటారు? 'ఆఁ మగవాళ్ళకేమిటిలెద్దూ తొంభయ్ రకాలుంటాయి మనకెందుకు! నిన్ను ఆత్మీయతగా చూసుకుంటూంటే చాలదా ఏమిటి?' అంటుంది అమ్మ. నాన్న, 'ఇన్నివేలు కట్నంపోసి ఈమాత్ర సంబంధంచేయటం నాతలకి మించిన పనయ్యింది తల్లీ! అలాంటివన్నీ పట్టుకకూర్చుంటే ఎలాగ? ఏదో కాలం గడిపెయ్యాలి' అంటారు. తన్ని ఎవరు

భరాయిస్తారు? భరించినా తనలోని పారిశుధ్యాన్ని ఎవరు గుర్తించుతారు?

'నిజంగా నీకు వెళ్ళిపోవాలనుందా? నిన్ను వదలి వుండ లేనుమరి! ఆపయిన నీయిష్టం!' ముద్దుగా అన్నాడు ఆనంద మూర్తి.

'నే నెక్కడకూ వెళ్ళనండి!' అతికష్టంమీద ఆమాట అని వంటింట్లోకి వచ్చింది కమల. కుంపటిమీద అన్నం తెర్లు తోంది. ఆనందమూర్తి వెనకాలే వచ్చాడు. వచ్చి వంటింటి గడపమీద కూర్చున్నాడు.

'సాదంలోకి ఏంచేస్తావ్! బంగాళాదుంపుల వేపుడు చెయ్యి ఇంట్లోఉన్నాయికదూ! నాకిష్టంఅని నేను కాలేజీలో చదివేటప్పుడు మా లక్ష్మి ఎప్పుడూ చేసి పంపించేది.' కమల మాట్లాడలేదు. అతను ఈ పదిరోజుల్లోనూ లక్ష్మినిగురించి వందసార్లయినా చెప్పివుంటాడు. ఆ అమ్మాయి తన్ని ఎంతగానో ప్రేమించిందట! తనూ ఆ అమ్మాయిని ఎంతో ఇదిగ ప్రేమించాడట! కాని వాళ్ల పెద్దవాళ్ల వొత్తిడివల్ల ఆ అమ్మాయి ఇంకొకర్ని పెళ్ళాడిందట. తనమీద ఆపేక్ష మరచిపోలేక వాళ్ళబ్బాయికి తన పేరు పెట్టుకుందట! ఆ భగ్న ప్రేమికురాలు.

కమల బంగాళాదుంపలు ముందేసుకుని కూర్చుంది. 'ఇద్దరూ పవిత్ర ప్రేమికులే! పాపం 'లక్ష్మి ప్రేమ ఎంతఉన్నత మైనది? పెద్దవాళ్ళ వొత్తిడికి లొంగిపోయి మరోడిచేత తాళి

కట్టించుకుని, వాడికి శరీరం అప్పగించి, పిల్లాణ్నికని, ఆపిల్లాడికి షాజేప్రియుడి పేరు పెట్టుకుంది ఆ పవిత్ర ప్రేమమూర్తి! ఆ లక్ష్మీనారాయణుడి వక్షస్థలంమీద చిరవిశ్రాంతి తీసుకుంటే ఈసలీ లక్ష్ములు, ప్రతి నరుడినీ ఆకర్షించి, లక్ష్మీనిస్థిరంగా తమ ఇళ్ళల్లో కట్టేయాలనుకుంటారు కాబోలున్న! ఆనందమూర్తి చెప్పుకుపోతున్నాడు. ఇంకోఅమ్మాయి వుండేదట. ఆ అమ్మాయికీ తనంటే వల్లమాలిన ప్రేమట! ఆ అమ్మాయి నోట్సులన్నీ వ్రాసిఇచ్చేదట! అది చూసి మిగతా అమ్మాయిలందరూ ఈర్ష్యపడేవారుట!

కమలకి ఆశ్చర్యం వేయలేదు జెలసీ అంతకన్నా లేదు. ఆనందమూర్తికి, అన్నీ ఆడస్నేహితాలే ఎక్కువ. ఎంత మంది ఎక్కువ ఆడవాళ్ళని ఆకర్షించకలిగితే అంత ఎక్కువగా అతని ప్రపతి పెరుగుతుంది. ఆతనిస్నేహితురాళ్ళల్లో ఒక్కళ్లూ విజ్ఞాన, వివేకాలున్నవాళ్ళు లేరు. అంతా ఇతని డబ్బునీ, అందాన్నీచూసి ఏదోవిధంగా వశపర్చుకోవా లనుకున్నవాళ్ళే! కాని ఇతను ఎవర్నీ పెళ్ళాడలేదు. కారణం అనుభవించటానికి శరీరాలు దొరుకుతున్నాయి. ఐదూ, పదీ పారేస్తే! ఇంక వాళ్ళని దేనికి పెళ్లాడాలి? తన స్టేటస్‌కి తగిన కట్నం' కాను కలతో పిల్లల నిస్తామని బోలెడంతమంది కాళ్ళకు బలపాలు కట్టుకుని తిరుగుతూనే వున్నారాయ్! స్త్రీలలో విజ్ఞాన, వివే కాలు రానంతవరకూ వ్యభిచారులకే కాదు, కుష్టురోగులకి కూడా పెళ్ళిళ్ళు అవుతాయి పాశవిక ఆనందాన్ని అనుభ

వించేది మగవాళ్ళు! వాట్లతాలూకు దుర్భరరోగాల్ని భరాయించేది ఆడవాళ్ళు.

కమల నిర్లిప్తతతో ఆనందమూర్తియొక్క ప్రేమకథలన్నీ వింటూ బంగాళాదుంపలన్నీ తరిగింది.

'ఇవ్వాళ చలాకీగా లేవేం?' అన్నాడు ఆనందమూర్తి అంతా చెప్పటం అయినాక.

కమల మౌనంగా నవ్వింది.

'ఎలా వున్నాను?' వ్యథగా అడిగింది.

'కొంపదీసి నీకు జెలసీ డెవలప్ కావటంలేదు కదా?' అన్నాడు ఆనందమూర్తి.

'దేనికి జెలసీ?' ఆశ్చర్యంగా అంది కమల.

'నన్నింతమంది అమ్మాయిలు ప్రేమించారని' కనుబొమ్మలు తమాషాగా ఆడించాడు ఆనందమూర్తి.

'జెలసీ లేదు. గర్వంగావుంది?' అంది ఒక దృఢనిశ్చయంతో ఆమెలో ఇదీ అని చెప్పలేని బలం నిండుకున్నట్లు అయింది.

'గర్వమా! దేనికి?' ఈసారి ఆనందమూర్తి ఆశ్చర్యపోయాడు.

'అంతమంది అమ్మాయిలు స్వార్జితం చేసుకోలేకపోయిన మీ శరీరాన్ని నా పిత్రార్జితంగా నేను పొందగలిగాను కదా అని.'

'నేను పిత్రార్జితాన్నా!' అద్భుతపడ్డాడు ఆనందమూర్తి

'కాక నాన్న నాకోసం చిన్నప్పుడు ఎన్నో బొమ్మలూ, గాజులూ కొనిపెట్టేవారు. నేను పుట్టి పెరిగినప్పటినుంచీ నాన్న నాకోసం ఏమి కావాల్సివచ్చినా కొనిపెడ్తూనేవున్నారు. అలా ఆయన కష్టార్జితంతోనే నా శరీరం పెరిగి పెద్ద దయ్యింది. అల్లానే ఆయన కష్టార్జితంతోనే మీ శరీరాన్ని కూడా నా ఆనందంకోసం కొనిపెట్టారు.' వ్యథగాఅంది కమల. ఆనందమూర్తికి వుక్రోషం వచ్చింది.

'నువ్వు పొరబాటు పడుతున్నావ్ కమలా! నేను మీ నాన్నగారిచ్చిన కట్నంకోసం పెళ్లాడాననుకున్నావా? నీరూపం, నీ గానం నా మనస్సులో మాయని ముద్రవేశాయి! అందు కని నిన్ను కావాలనే పెళ్ళిచేసుకున్నాను. ఒకవేళ మీ నాన్న కట్నం ఈయకపోయినా నిన్నే పెళ్లిచేసుకోవాలనే నిర్ణయాని కొచ్చానుకూడా' ఆనందమూర్తి. కమల నిలువెల్లా వొణికింది. తీవ్రంగా అన్నాడు.

'నా రూపం! నా గానం! ఆ లక్ష్మిలోనూ, శాంత లోనూ, సరోజలోనూ, రాణిలోనూ లేవా? వాళ్ళని దేనికని పెళ్లాడలేదూ! నేను వాళ్ళలా అతి తేలిగ్గా లభ్యమయ్యే మాటుంటే నన్ను మాత్రం పెళ్లాడేవారేనా? లేక నన్నూ ప్రేయసుల లిస్టులో జమ వేసుకునేవారా? ఎందుకు అలా అబద్ధాలు చెప్పటం!' ఇవి ఆమె గొంతులో గురగురలాడిన ప్రశ్నలు. కమల పైకి అవలేదు. తీవ్రధోరణిలో వున్న ఆనంద మూర్తితో ఇంక మాట్లాడకూడదు. తనని ఆజన్మాంతం

భరాయించాల్సినవాడు. తనజన్మానికి విముక్తిలేదు. శరీరంతో పాటు, ఆత్మకూడా బలిపెట్టవలసిందే! తప్పదు! కమల బంగాళాదుంపల ముక్కలుతీసి కుంపటిమీద మూకుడులో సలసల కాగుతున్న నూనెలో వేసింది. అట్లకాడతో కలుపుతూ కుంపటి దగ్గరగా కూర్చుంది. బంగాళాదుంపల ముక్కలు వేగుతున్నాయి. తన భర్తకి ఇష్టమయినదిట ఆ కూర! భర్త అనగా, కూడూ, గుడ్డా ఇచ్చి స్త్రీలని చచ్చేదాకా భరాయించేవాడు కదా భర్త! ఒకరోజున ఒకలక్ష్మి, ఒక శాంతా ఒక సరోజా, ఒక రాణికూడా ఈ ముక్కలు ఇలానే వేపి, అతన్ని సుఖపెట్టటంకోసం ఇచ్చేవారుట. వాళ్ళకి భర్తకాలేక పోయాడు ఆనందమూర్తి. ఈరోజు తనది! ఈరోజు తనూ జాగ్రత్తగా బంగాళాదుంపలువేసి అపేక్షగా అతనికి భోజనం పెట్టుతుంది. తర్వాత! కమలకి కళ్ళు తిరిగాయి. శరీరం అవశమైపోయింది. కూర్చున్నది కూర్చున్నట్లే కుంపటిమీదకు వొంగిపోయింది.

'అరెరె!' అంటూ ఆనందమూర్తి వొచ్చి కమలని లేవదీశాడు. అప్పటికే ఆమె గుండ్రని గులాబీబుగ్గలని, సలసల మరిగిన నూనెలో వేగుతున్న బంగాళాదుంపలు గట్టిగా హత్తుకున్నాయి. బొబ్బలు పొక్కుతున్న బాధలోనే, చిరునవ్వుతో కమల.

'ఇప్పుడు నా మనస్సెంతో తృప్తికరంగా ఉన్నదండీ!' అంటూ రెండు చెంపల్నించీ అ వేగిఅత్తుకుపోయిన ముక్కల్ని వూడదీసింది. ఆనందమూర్తి తెల్లగానిమ్మకాయడిప్పంత మేర

పొరలేస్తూన, ఆమె గులాబీబుగ్గల వెంపుచూచి, హడలి పోయాడు.

'నీకు ఫిట్స్ వస్తూంటాయాకమలా!' ఆదుర్దాగా అడిగాడు.

'ఇవ్వేళే' ఏదో నీరసం చేసింది.' అంటూ లోపలికి వెళ్ళి మంచంమీద పడుకుంది. ఆనందమూర్తి కూడా వెళ్లాడు. ఆతని మెదడులో ఏదో తళుక్కుమని మెరిసింది

'నీరసం ఎందుకో నాకు తెల్సులే!' కమల దగ్గరికి వెళ్ళి నవ్వుతూ అన్నాడు.

అతని నవ్వుముఖం చూచేసరికి కమలకి జాలివేసింది.

'అదికాదు' అంది బాధగా.

'ఏది కాకపోయిన, నువ్వోక వరం కోరుకోవాలి! నీకు ఎవరు కావాలి? అమ్మాయా! అబ్బాయా!' కులాసాగా అన్నాడు ఆనందమూర్తి.

'నాకెవరూవద్దు!' హృదయపూర్వకంగా అని కళ్ళు మూసుకుంది కమల. ఆనందమూర్తి కమల బుగ్గలమీదబొబ్బలకి వ్రాయటానికి 'నవనీతం' తెస్తానని సైకిలు తీసుకుని స్నేహితు డింటికి వెళ్లాడు.

కమల మళ్లీ ఒకసారి అనుకుంది 'నా సర్వస్వం కోల్పోయాను. నాలో ఏమీ మిగల్లేదు' కళ్ళుమూసుకుని పడుకుంది కమల.

* * *